## మధురగాయకుడు, స్వరదర్శకుడు మధుబాబు : సంగీత దర్శకుడు సాలూరి కోటి



పురస్కార గ్రహీతలతో కోటి, మధుబాబు, దైవజ్ఞశర్మ, తనికెళ్ళభరణి తదితర అతిథులు

**రవీంద్రభారతి, జులై 17 ప్రభాతవార్త :** సుమధుర గాయకుడు, స్వరదర్శకుడు మధుబాబు అని ప్రఖ్యాత సంగీత దర్శకుడు సాలూరి కోటి అన్నారు. ప్రముఖ గాయకుడు, సంగీత దర్శకుడు మధుబాబుశాస్త్రి నేతృత్వం, నిర్వహణలో పాటే నాప్రాణం సినీసంగీత విభావరి నవరసభరితం వీనులవిందుగా సాగింది. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో మనీషా కల్చరల్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో రవీంద్రభారతి వేదికల్లో సంస్థ 30వ సంగీత ప్రయాణంలో భాగం వర్ధమాన గాయకుల ఆణిముత్యాల్లాంటి సినీగీతాల గానామృతంతో సాగిన పాటే నాప్రాణం శీర్షికన విభావరి మధురానుభూతిని కల్గించి ఆహుతులైన అశేష సంగీతప్రియులు, ఔత్సాహిక ప్రేక్షకులను సినీసంగీతలోకంలో విహరింపజేసి మంత్రముగ్ధులను చేసింది. ప్రవహించే గంగానది మనీషా కల్చరల్ ఆర్గనైజేషన్, గాయకుడు, సంగీత దర్శకుడు మధుబాబు అని దైవజ్ఞశర్మ అభివర్ణించారు. పాటే ప్రాణంగా మూడుదశాబ్దాలుగా సాగుతున్న మధురగాయకుడు, సంగీతదర్శకుడు మధుబాబు అని తనికెళ్ళభరణి అన్నారు. సరస్వతీ ఉపాసకుడు దైవజ్ఞశర్మ సభాధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రఖ్యాత సంగీత దర్శకుడు సాలూరి కోటి, విశిష్ట అతిథులుగా తనికెళ్ళ భరణి, ఎ.కోదండరామిరెడ్డి, కాంచనపల్లి రాజేంద్ర రాజు, చంద్రమోహన్, సుబ్రహ్మణ్యం తదితరులతో కలిసి ప్రముఖ వాస్తు శాస్త్రవేత్త కాశీనాథుని శ్రీనివాస్, వేదపండితుడు గోపీకృష్ణ దంపతులను ఘనంగా సత్కరించి బిరుదులను ప్రదానంచేసి ఎంతగానో అభినందించారు.



హైదరాబాద్ వార్త

# ధూల్‌పేట్‌పై ఎక్సైజ్‌శాఖ ఫోకస్..

-నిన్న మొన్నటివరకు సారాయి తయారీ కేంద్రం
-నేడు గంజాయికి పెట్టింది పేరుగా ధూల్‌పేట్
-ప్రజల్లో మార్పుకోసం శ్రమిస్తున్న అధికారులు
-ప్రత్యేక బృందాలతో ఇంటింటా సోదాలు
-యువతకు కౌన్సిలింగ్ ..కొత్తచట్టాలపై అవగాహన

**హైదరాబాద్,జూలై 17,ప్రభాతవార్త:**
ధూల్‌పేట్ అంటే హైదరాబాద్‌లో తెలియనివారుండరు. కళా నైపుణ్యాలతో పాటు సారాయి తయారీ కేంద్రంగా కొంతకాలం విరాజిల్లింది. గత ప్రభుత్వం హయాంలో సారాయిపై ఉక్కుపాదం మోపడంతో ఇప్పుడు ధూల్‌పేట్ అంటే గంజాయికి పెట్టింది పేరుగా మారింది. నాడు సారాయిని తదిమిపెట్టిన ఎక్సైజ్‌శాఖ ..ఇప్పుడు గంజాయి ఆనవాళ్ల లేకుండా చేయడానికి అడుగులు కదుపుతుంది. హైదరాబాద్‌ను డ్రగ్ ఫ్రీసిటీగా చేయాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. ఈమేరకు ఎక్సైజ్‌శాఖ, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎస్టీఎఫ్, డిటిఎఫ్ ఎక్సైజ్ పోలీసులు రెండు నెలలుగా నిరంతరం దాడులు నిర్వహిస్తున్నారు.

**చరిత్ర కలిగిన ధూల్‌పేట్ ..**
నిజాం కాలంలో ఉత్తర ప్రదేశ్‌నుంచి జీవనోపాధికి హైదరాబాద్‌కు చాలామంది కుటుంబాలు ఇక్కడికి వలస వచ్చారు. ఈకుటుంబాల జీవనోపాధికి అనాటి నిజాం ప్రభువు పూర్తిగా సహకరించారు. ఉత్తరప్రదేశ్ నుంచి వలసవచ్చిన లోదా సామాజిక వర్గీయులే ధూల్‌పేట్‌లో అత్యధిక నివాసితులు. కళానైపుణ్యానికి వేదికగా, జీవనోపాధియే పరమావధిగా దశాబ్దాలుగా జీవిస్తున్న ఉత్తరాధిల జీవన విధానం, భక్తిభావం చూస్తే అందిరినీ ఆకట్టుకుంటారు. సకవల దేవలతల అధిపతి, పరపూజ్యుడైన గణేష్ (వినాయకుడి )విగ్రహాల తయారీ ధూల్‌పేట్‌లో ప్రధాన ఉపాధి. వినాయకుడితోపాటు అమ్మవారు, ఇతర దేవతా విగ్రహాల తయారీకి ధూల్‌పేట్ ప్రసిద్ధి. విగ్రహాలతోపాటు రాఖీలు, పతంగులు తయారు చేయడంతో పాటు అన్నిరకాల కులవృత్తులకు పనులు చేస్తూ జీవిస్తుంటారు. ధూల్‌పేటన ప్రాంతంలో ఐదు ఎక్సైజ్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఏడులక్షల మేర జనాభా ఉంటుంది. భక్తిభావంతో జీవించే లోదా ప్రజల్లోకి ఒకప్పుడు సారాయి, ఇప్పుడు గంజాయి పట్టి పీడిస్తుంది.



ధూల్‌పేట్‌లో సోదాలు చేస్తున్న ఎక్సైజ్ పోలీసులు

**దారి మళ్ళించడమే లక్ష్యంగా ...**
ధూల్‌పేట్ జీవించేవారు ఎక్కువగా సామాన్య, మధ్యతరగతి ప్రజలే..రెక్కాడితే కానీ డొక్కాడని పరిస్థితులు. ఉదయం నుంచి సాయంత్రం వరకు కష్టపడి శ్రమకు ఉపశమనంగా మద్యానికి బదులు ఒకప్పుడు నాటు సారా ,ఇప్పుడు గంజాయిని అలవాటు చేసుకున్నారు. నార్కోటిక్ డ్రగ్‌గా ఉన్న గంజాయి వాడకం వల్ల యువత,నుంచి పెద్దవారి వరకు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. గంజాయి నుంచి ధూల్‌పేట్ వాసులను రక్షించడానికి ఎక్సైజ్‌శాఖ కమిషనర్ ఇ.శ్రీధర్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ బి.కమలాసన్‌రెడ్డిలు ప్రత్యేక దాడులు నిర్వహించాలని అదేశించారు. ఈమేరకు రెండు నెలలనుంచి ఎక్సైజ్ శాఖ పోలీసులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ,స్టేట్ టాస్క్‌ఫోర్స్,డిస్ట్రిక్ట్ టాస్క్‌ఫోర్స్ బృందాలు ఇంటింటికి వెళ్లి సోదాలు నిర్వహిస్తున్నారు. ఈనెల 13న ఎక్సైజ్‌శాఖ 8బృందాలతో 120మంది సిబ్బంది గంజాయి అమ్మకాందార్లు కొనుగోలు దారుల ప్రాంతాల్లో దాడులు నిర్వహించి కొందరు బాధితులను పట్టుకుని విచారించారు. మరో మూడురోజుల పాటు ధూల్‌పేట్‌లోని ఎక్సైజ్ పోలీస్ పరిధిలో గంజాయిని వినియోగిస్తున్న యువతకు, వారి తల్లిదండ్రులకు గంజాయి వల్ల కలిగే నష్టాలు ,కొత్తగా వచ్చిన చట్టాల వల్ల కలిగే నష్టాలపై కౌన్సిలింగ్ ఇచ్చారు. దీంతో ఎక్సైజ్ పోలీసులు మూకుమ్మడిగా దాడులు చేస్తుండటంతో అమ్మకందారులు, రవాణా నింధితులు , వినియోగదారుల్లో గుబులు చోటు చేసుకుంటుంది. ఈదాడుల్లో ఎక్సైజ్‌శాఖ జాయింట్ కమిషనర్లు ఖురేషి, శాస్త్రీతోపాటు అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌కుమార్ ,ఏఈఎస్‌లు శ్రీనివాస్‌రావు, సౌజన్య ,ధూల్‌పేట్ సిఐ మధుబాబు తోపాటు 120కిపైగా సిబ్బంది 37 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించారు. మంగళవారం హైదరాబాద్ ఎక్సైజ్‌శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్ హెడ్ అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఐదుటీంలతో 50మందిపైగా ఎస్టిఎఫ్, డిటిఎఫ్,ఎన్‌ఫోర్స్ యంత్రాంగం కలిసి మళ్ళీ దాడులు నిర్వహించారు. బుధవారం రాత్రి 11ంటలవరకు దాడులు నిర్వహించి 2కేజీల గంజాయిని పట్టుకుని ఇద్దరిని అరెస్ట్ చేశారు.

**మార్పు దిశగా అడుగులు వేయాలి**
**-ఎక్సైజ్ ఎన్ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ కమలాసన్‌రెడ్డి**



కేంద్రం తీసువచ్చిన కొత్తచట్టాలు, తెలంగాణ ప్రభుత్వం డ్రగ్స్, గంజాయిని లేకుండా చేయాలనే లక్ష్యానికి ధూల్‌పేట్ ప్రజలు పూర్తిగా సహకరించాలి. గతంలో ఎలా ఉన్నా ..ప్రస్తుతం డ్రగ్స్ గంజాయి అమ్మకాలు..రవాణా వినియోగాలపై ఎక్సైజ్‌శాఖ గట్టి నిఘా పెట్టింది. ధూల్‌పేట్‌లో గంజాయిని తుదిముట్టించే వరకు దాడులు జరుపుతుంటాం. ఈవిషయంలో ప్రజలు మాకు సహకరించాలి. గంజాయిని వినియోగించినా అమ్మకాలు జరిపినా, రవాణా చేసినా ఎక్సైజ్‌పోలీసులకు లభిస్తే కఠిన కేసులతో కటకటాల్లోకి వెళ్ళాల్సి వస్తుంది. గంజాయి ఇతర డ్రగ్స్ సమాచారాన్ని 18004252523 టోల్‌ఫ్రీ నెంబర్‌కు సమాచారం ఇవ్వాలి.

## సయ్యద్ అష్రఫ్, కొప్పుల అఖిలకు స్వర్ణాలు

**- మాన్‌సూన్ రెగట్టా పోటీలు**



స్వర్ణం గెలుపొందిన విజేతలు అష్రఫ్,అఖిల



**హైదరాబాద్, జూలై 17,ప్రభాతవార్త:**
మాన్‌సూన్ రెగట్టా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. ప్రధాన విభాగాలకు తోడు తేలికైన, యువ సెయిలర్ల కోసం నిర్వహించిన హాఫ్ రిగ్ ఫ్లీట్‌లో నగరానికి చెందిన సయ్యద్ అష్రఫ్, కొప్పుల అఖిల స్వర్ణపతకాలు గెలిచారు. మూడోరోజు బుధవారం జరిగిన ఈపోటీల్లో సికింద్రాబాద్ తారా బాయ్స్ హోమ్‌కు చెందిన సయ్యద్ అష్రఫ్ (11) బంగారు పతకంతోపాటు లైట్‌ఫ్లీట్ ట్రోఫీని గెలిచాడు. నల్లగుట్ట ప్రభుత్వ పాఠశాలకు చెందిన యువరాజ్ గుప్తా (9), ఉద్భవ్ స్కూల్‌కు చెందిన పార్థు (11) వరుసగా రజతం, కాంస్యలు సొంతం చేసుకున్నారు. బాలికల హాఫ్‌రింగ్ ఫ్లీట్‌లో అఖిల కొప్పు (13) స్వర్ణం, రెయిన్‌బో హోమ్స్ ముషీరాబాద్‌కు చెందిన నిఖిత జీరు (12) రజతం సాధించారు. మరోవైపు అండర్ 16 ఆప్టిమిస్ట్ ఫ్లీట్ విభాగంలో మూడోరోజు కూడా గోవర్ధన్ పల్లార జోరు కొనసాగించాడు. అతనితోపాటు స్థానిక సెయిలర్లు లాహిరి కొమరవెల్లి, దీక్షిత కొమరవెల్లి సిస్టర్స్ ఒక్కోరేస్ చొప్పున గెలుపొందారు. మరోనాలుగు రేసులు మిగిలి ఉన్న విభాగంలో గోవర్ధన్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. దీక్షిత మూడో స్థానంలో కొనసాగుతుంది. కాగా, మూడోరోజు పోటీల్లో లాహిరి స్టార్‌గా నిలిచింది. ఎడమ చేయి విరిగి నెలలు ప్రాక్టీస్‌కు దూరంగా ఉన్న ఆమె ఒకరేసులో విజేతగా నిలిచి ఔరా అనిపించింది. అండర్ 18 అంతర్జాతీయ 420 మిక్స్‌డ్ డబుల్స్‌లో తెలంగాణకు చెందిన వైష్ణవి వీరవం శం-శ్రావత్ క్షేత్రవాత్, తనూజ కామేశ్వర్ -గణేష్ పీర్కట్ల జోడిలు తొలి రెండు స్థానాల్లోనే కొనసా గుతున్నారు. ఐఎస్‌సిఏ 4 బాలుర విభాగంలో మధ్యప్రదేశ్‌కు చెందిన సౌమ్యాసింగ్ అగ్రస్థానంలో ఉండగా..తెలంగాణకు చెందిన మాన్యారెడ్డి మూడోస్థానంలో నిలిచింది.

## ముదిరాజ్ కో ఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్‌గా జ్ఞానేశ్వర్ బాధ్యతలు



ముదిరాజ్ కో ఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు తీసుకుంటున్న జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్

**నార్సింగి, జూలై 17 ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ నియోజకవర్గం సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మూడు దశాబ్దాల రాజకీయ అనుభవం కల బొర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్ బుధవారం ముదిరాజ్ కో ఆపరేటివ్ కార్పోరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టారు. మాసబ్‌ట్యాంక్‌లోని తెలుగు సంక్షేమ భవన్‌లోని ఆరో అంతస్థులో ఉన్న తన ఛాంబర్‌లో సంబంధిత అధికారుల సూచనల మేరకు రిజిస్ట్రార్‌లో తొలి సంతకం పెట్టారు. జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌ను తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్, రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, టిఎంఆర్ ఐఐఎస్ అధ్యక్షులు ఫాహిం ఖురేషి, మాజీ ఎంపి రంజిత్‌రెడ్డిలు పుష్పగుచ్ఛాలిచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముదిరాజ్‌లు విద్య,ఉద్యోగ,ఉపాధి, రాజకీయ రంగంలో రాణించాలన్న సదుద్దేశంతో సీఏం రేవంత్‌రెడ్డి తొలిసారిగా ఓ కార్పోరేషన్‌ను ఏర్పాటు చేశారని, ఇందుకు ముదిరాజ్‌లంతా కాంగ్రెస్ సర్కారుకు రుణపడి ఉండాలన్నారు.తనకు ఈ బాధ్యతను అప్పగించిన సీఏం రేవంత్‌రెడ్డికి జీవితాంతం ఋణపడి ఉంటానని తెలిపారు.

## హస్తకళల అభివృద్ధి సంస్థ ఆదాయం రూ.600కోట్లకు చేరాలి

**-రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్**



రాష్ట్రంలో హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా బాధ్యతలను స్వీకరిస్తున్న నాయుడు సత్యనారాయణగౌడ్, చిత్రంలో మంత్రి పొన్నం ప్రభాకర్, రాష్ట్ర చేనేత, జౌళి, హస్తకళల విభాగం ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్, కుటుంబ సభ్యులు

**చిక్కడపల్లి, జూలై 17 ప్రభాతవార్త:** రాష్ట్రంలో హస్తకళల అభివృద్ధి సంస్థ తమ ఉత్పత్తుల ద్వారా వచ్చే ఆదాయాన్ని రూ.600కోట్లకు చేరుకోవాల్సిన అవసరం ఉందని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నంప్రభాకర్ అన్నారు. బుధవారం ఆర్టీసిక్రాస్‌రోడ్స్‌లో హస్తకళాభవన్‌లో రాష్ట్ర హస్తకళల అభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన నాయుడు సత్యనారాయణగౌడ్ బాధ్యతలను స్వీకరించారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ హస్తకళల కార్పొరేషన్ 2013 ఏర్పడినప్పటికీ 2015 నుంచి ఈ కార్యక్రమాన్ని ప్రారంభించకున్నామని, క్షేత్రస్థాయిలో కళానైపుణ్యం కళాకారులను వారి వృత్తులను ప్రోత్సహిస్తూ వారికి మార్కెటింగ్ సౌకర్యానికి వేదికగా ఈ సంస్థ ముందుందన్నారు. ఈ సంస్థ మరింత అభివృద్ధి చెందడంతో పాటు కళాకారులను కూడా ఆదాయాన్ని కల్పించే స్థాయికి ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇల్లందు శాసనసభ్యుడు కోరం కనకయ్యతో పాటు నాయుడు సత్యనారాయణగౌడ్ భార్య విజయ, కుమార్తెలు స్వప్న, సంధ్యా, కుమారుడు ధరణి, కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్ర పరిశ్రమలు, చేనేత, జౌళి, హస్తకళల విభాగం ముఖ్యకార్యదర్శి శైలజా రామయ్యర్‌తో పాటు శ్రీకంచర్ల గోపన్న సేవాసమితి(భద్రాచలం) అధ్యక్షుడు మార్గాని శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

# ప్రశాంతంగా మొహర్రం ఊరేగింపు





-మొహర్రం ఊరేగింపు ఏర్పాట్లను పరిశీలించిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి
-మొహర్రం ఊరేగింపు సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో గట్టి బందోబస్తు

**చార్మినార్,జూలై 17 ప్రభాతవార్త :**
మొహర్రం సంతాప దినాల సందర్భంగా బుధవారం పాతబస్తీ పుర వీధులో మొహర్రం సామూహిక ఊరేగింపు ప్రశాంతంగా జరిగింది.మొహర్రం ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలో దక్షిణ మండలం పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండ పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.కర్ణాటక రాష్ట్రానికి చెందిన రూపావతి ఏనుగు ఊరేగింపులో పాల్గొన్నది.పాతబస్తీలోని డబీర్‌పుర బీబీకా అలావా నుంచి ప్రారరభమైన మొహర్రం ఊరేగింపు డబీర్‌పుర,మీర్‌చౌక్,ఎత్తెబార్ చౌక్,చార్మినార్,గుల్జారాహౌస్,పంజేషా,మీరాలం మండి, దారుషిపా,కాలీకబర్ ప్రాంతాలు మీదుగా చాదర్‌ఘట్ వరకు కొనసాగింది.షియా ముస్లిం సోదరుల ఊరేగింపులో బ్లేడులతో కోచుకుంటూ రక్తం చిందించారు. చార్మినార్ వద్ద ఊరేగింపు చూడటానికి పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. చార్మినార్ వద్ద ఏర్పాటు చేసిన వేధికపై నుంచి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి,నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిలు బీబీకాఆలంకు దట్టీలు సమర్పించారు.కాగా పురానీహవేలి వద్ద నిజాం వారసులు బీబీకాఆలంకు దట్టీలు సమర్పించి మొక్కు బడులు సమర్పించుకున్నారు.పాతనగరంలోని చార్మినార్,మీరాలం మండి,మీర్‌చౌక్,గుల్జారాహౌస్,ఫత్తర్‌గట్టితో పాటు ప్రాంతాలలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశారు.నగర పోలీస్ ఉన్నతాధికారులు విక్రమాన్ సింగ్,విశ్వప్రసాద్,దక్షిణ మండలం డిసిపి స్నేహ మెహ్రా,అడిషనల్ డిసిపి షేక్ జహంగీర్‌లు శాంతా భద్రతలను పర్యవేక్షించారు.

**మొహర్రంకు అన్ని ఏర్పాట్లు : ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి**
తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి బుధవారం పాతబస్తీలో పర్యటించి మొహర్రం ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా చార్మి వద్ద ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎ.శాంతి కుమారి మాట్లాడుతూ మొహర్రం సందర్భంగా ఎటువంటి ఇబ్బందులు కలగకుండ ప్రభుత్వం అన్ని ఏర్పాట్లు చేసిందని తెలిపారు.సీనియర్ అధికారులు సమన్వయంతో పని చేశారని ఆమె తెలియజేశారు.మొహర్రం సందర్భంగా గట్టి బందోబస్తు : సిపి కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డిమొహర్రం సందర్భంగా నగరంలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు.ప్రశాంతమైన వాతావరణంలో మొహర్రం ఊరేగింపు కొనసాగిందని ఆయన తెలియజేశారు.

## శ్రీఉజ్జయినీ మహాకాళీ జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి

**-21న బోనాలు. 22న రంగం ,అంబారీ ఊరేగింపు, మహాహారతి**

**-భక్తులకు అసౌకర్యం కలగకుండా చూడాలి : కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి**



ఏర్పాట్లపై అధికారులతో చర్చిస్తున్న కలెక్టర్

**బేగంపేట జులై 17,ప్రభాతవార్త :**
సికింద్రాబాద్ శ్రీఉజ్జయినీ మహాకాళీ అమ్మ వారి జాతర ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలని,జాతర సమయంలో అమ్మ వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.బుధవారం శ్రీఉజ్జయినీ మహాకాళీ ఆలయాన్ని సందర్శించిన కలెక్టర్ అధికారులకు పలు సూచనలు చేసారు.జులై 21న బోనాలు,22న రంగం (భవిష్యవాణి) అంబారీ ఊరేగింపు,మహాహారతి కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా చేపట్టాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.దేవాలయాన్ని సందర్శించిన కలెక్టర్ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు.ఆర్ అండ్ బీ,విద్యుత్, వైద్య, దేవాదాయశాఖ,మున్సిపల్,పోలీసు తదితర ముఖ్య శాఖల అధికారులతో మహాకాళీ దేవాలయంలో జరిగే ఏర్పాట్లపై ఆయన సమీక్షించారు.ఏమైనా పనులు మిగిలి ఉంటే త్వరిత గతిన పూర్తి చేయాలని,అధికారులను ఆదేశించారు.బోనాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరంతరం పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు.రెప్పపాటు కాలం కూడా విద్యుత్ సరఫరాకు అంతరాయం వాటిల్లకుండా నిరంతరాయంగా కరెంట్ సరఫరా చేయాలని విద్యుత్ శాఖ అధికారులను ఆదేశించారు.మున్సిపాలిటీ దేవస్థాన పరిసరాలు ఎప్పటి కప్పుడు పరిశుభ్రంగా ఉండేలా చెత్తా చెదారం తీసివేసేలా మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో కలెక్టర్ వెంట సికింద్రాబాద్ ఆర్డీవో దశరథ్‌సింగ్,తహశీల్దార్ ఈఈ,జీహెచ్ఎంసీ,ట్రాన్స్‌కో,ఆర్‌అండ్‌బీ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

# ప్రాణాలు తీసే బెట్టింగ్ పద్మవ్యూహం

-గేమింగ్‌తో మొదలు., బెట్టింగ్ యాప్‌లకు బానిసలు
-అప్రమత్తమైన పోలీసులు, సామాన్యులకు సూచనలు

**హైదరాబాద్, జూలై 17, ప్రభాతవార్త:**
తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించాలనే అత్యాశతో ఎందరో సామాన్యులు ఎన్నుకునే తప్పుడు దారుల్లో బెట్టింగ్ యాప్‌లు కూడా ముఖ్య భూమిక పోషిస్తున్నాయి. ఒక పక్క ఇన్‌స్టెంట్ మనీ కోసం బెట్టింగ్ యాప్‌లకు బానిసలైన సామాన్యులు కొందరు తమ బ్యాంక్ ఖాతాలు ఖాళీ చేసుకుంటుంటే, మరోపక్క ప్రముఖ యూట్యూబర్లు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు అధిక మొత్తంలో డబ్బు తీసుకుని ఈ యాప్‌లను విస్తృత ప్రచారం చేస్తున్నారు. దాంతో ఎందరో సబ్‌స్క్రైబర్లతో పాటు వీరి కంటెంట్ వీక్షించే ప్రేక్షకులు బెట్టింగ్ యాప్‌లకు ఆకర్షితులవుతున్నారు. సాధారణంగా బెట్టింగ్ యాప్‌లు ప్లే స్టోర్‌లో ఉండకుండా ప్రత్యేక ఏపీకే ఫార్మాట్‌లో లభిస్తాయి. ఇటువంటి అపరిచిత అప్లికేషన్లను ఇన్‌స్టాల్ చేయడం వల్ల చారవాణుల్లోకి మాల్‌వేర్ వంటివి చేరడమే కాకుండా బాధితుల కాంటాక్ట్ వివరాలతో పాటు వివిధ పాస్‌వర్డ్‌లు, ఫోన్‌లో ఉన్న ఫోటోలతో సహా సమస్త సమాచారం సైబర్ నేరస్థుల చేతికి వెళ్ళిపోతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కానీ ప్రస్తుత పరిస్థితుల్లో ఈ తరహా బెట్టింగ్ యాప్‌లు ప్లేస్టోర్‌లోకి కూడా ప్రవేశించడంతో మొబైల్ యూజర్లు వాటిని నమ్మశక్యంగా భావించి ఇన్‌స్టాల్ చేసుకుంటున్నట్లు తెలుస్తోంది. అందుకు 'పరీమేచ్' వంటి యాప్‌లను పలువురు ముఖ్య ఉదాహరణగా చెబుతున్నారు.

**ఆత్మహత్యలు పునరావృతం :**
బెట్టింగ్ యాప్‌లలో పెట్టిన డబ్బు పోగొట్టుకుని ఇంటా బయటా చెప్పుకోలేక, రహస్యంగా చేసిన అప్పులు తీర్చలేక ఎందరో బాధితులు ఆత్మహత్యకు పాల్పడిన ఘటనలు జరుగుతూనే ఉన్నాయి. ఇన్‌స్టెంట్ మనీకి అలవాటు పడినవారికి బెట్టింగ్ యాప్‌లలో ఒక్కసారి డబ్బు రావడంతో, విడతల వారీగా ఎక్కువ మొత్తంలో డబ్బు పెట్టి, నష్టపోతున్నారు. విద్యార్థులు, చిరుద్యోగులే కాకుండా సెంట్రల్ గవర్నమెంట్ స్థాయి ఉద్యోగులు కూడా బెట్టింగ్ యాప్‌లకు అతీతం కాదని తాజాగా జరిగిన విషాధ సంఘటనతో నిరూపితమైంది. తెలంగాణకు చెందిన ఇంజినీరింగ్ విద్యార్థి కాలేజీ ఫీజు కట్టాల్సిన రూ.1 లక్ష నగదుని బెట్టింగ్ యాప్‌లో పెట్టి పోగొట్టుకుని, ఒత్తిడికి గురై కింద పడి ఆత్మహత్య చేసుకున్న ఘటన మరువక ముందే అటువంటి మరో ఘటన పునరావృతమైంది. తెలంగాణలో రఘునాథపల్లికి చెందిన దేవరాజ్ అనే ఉన్నత రైల్వే ఉద్యోగి బెట్టింగ్ యాప్‌లకు అలవాటుపడి, అప్పులపాలై రైలు కింద తలపెట్టి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇటువంటి ఘటనలు పునరావృతమవుతుండడంతో నగర సైబర్ క్రైమ్ పోలీసులు అప్రమత్తమై బెట్టింగ్ యాప్‌లకు ప్రజలు ఆకర్షితులవ్వకుండా తగు జాగ్రత్తలు సూచించారు. మరోపక్క బెట్టింగ్ యాప్‌లతో పలువురిని మోసం చేసిన నిందితుడిని సైబరాబాద్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 'మెజిస్టిక్ ప్రైడ్', 'కేసినో ప్రైడ్' వంటి నకిలీ బెట్టింగ్ యాప్‌లతో పలువురు బాధితులను మోసం చేసిన చిన్నిరెడ్డి శ్రీనాథ్ రెడ్డి(23) అలియాస్ సందీప్ సన్నీ అనే నిందితుడిని సైబరాబాద్ పోలీసులు అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు మంగళవారం ప్రకటించారు.

**పోలీసుల సూచనలు :**
రానున్న మూడు నాలుగేళ్ళలో సైబర్ క్రైమ్ తగ్గుముఖం పట్టినా, పెరుగుతున్న బెట్టింగ్ యాప్‌ల రూపంలో జనాలపై దాని ప్రభావాన్ని చూపిస్తుందని నగర సైబర్ క్రైమ్ పోలీసులు చెబుతున్నారు. ఒకానొక సమయంలో వివిధ గేమింగ్ యాప్‌లకు బానిసైన వారు క్రమ క్రమంగా బెట్టింగ్ యాప్‌లపై ఆకర్షితులవుతున్నట్లు తెలిపారు. వీటిని అరికట్టాలంటే ఒక్క నేర నిర్మూలన మాత్రం సరిపోదనీ, ప్రజలందరికీ కూడా నేరాల పట్ల అవగాహనతో పాటు బెట్టింగ్ వల్ల తీవ్రంగా నష్టపోతామనే వివేకం ఉండాలన్నారు. నెలలో ప్రతి బుధవారం పోలీసు బృందాల ఆధ్వర్యంలో సైబర్ నేరాలపై ప్రచారం చేసే అవగాహనా సదస్సుల్లో బెట్టింగ్ యాప్ మోసాల గురించి ప్రత్యేకంగా వివరిస్తున్నట్లు తెలిపారు. సైబర్ నేరానికి దగ్గరగా జరిగే ఈ బెట్టింగ్ మోసాలు అరికట్టేందుకు సామాన్యులు కూడా బాధ్యత వహిస్తూ బెట్టింగ్‌ను నిషేధానికి నడుంకట్టాలన్నారు. ఆన్‌లైన్‌లో కనిపించిన నకిలీ ఐడిలపై, అనుమానిత ఖాతాలపై తక్షణమే రిపోర్ట్ చేసి ఇతరులను వారి వలలో పడకుండా కాపాడమని సూచించారు. టిక్‌టాక్ వంటి సోషల్ యాప్‌లు, పబ్జీ, బ్లూవేల్ గేమ్‌లు నిషేధించిన స్థాయిలో బెట్టింగ్ యాప్‌లనూ నిషేధించవచ్చనీ, త్వరలోనే అది సాధ్యపడుతుందనీ, కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం పైన బెట్టింగ్ యాప్స్ నిర్మూలన ఆధారపడి ఉందని తెలిపారు.

## జానపద కళాకారుల సంఘ రాష్ట్రాధ్యక్షురాలిగా విజయశ్రీ
### - విశ్రాంత ఐఎఎస్ అధికారి డా. కె.వి.రమణాచారి


విజయశ్రీని సన్మానిస్తున్న డా. కె.వి.రమణాచారి తదితర సంఘ బాధ్యులు

**నాంపల్లి, జులై 17 ప్రభాతవార్త :** తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం రాష్ట్ర మహిళా అధ్యక్షురాలిగా విజయశ్రీని నియమించినట్లు తెలంగాణ ప్రభుత్వ పూర్వ సలహాదారు, విశ్రాంత ఐఎఎస్ అధికారి సంఘ రాష్ట్ర గౌరవాధ్యక్షుడు డా. కె.వి.రమణాచారి మీడియాకు తెలిపారు. ఈ మేరకు బుధవారం విజయశ్రీని శాలువాతో ఘనంగా సత్కరించి శుభాశీస్సులందజేశారు. గతంలో మహిళా అధ్యక్షురాలిగా పనిచేసిన స్నేహలత మురళి స్థానంలో ప్రస్తుతం ఉపాధ్యక్షురాలిగా కొనసాగుతున్న విజయశ్రీని అధ్యక్షురాలిగా నియమించినట్లు తెలిపారు. తన స్పందనలో విజయశ్రీ నా సమర్థతను గుర్తించి సంఘ మహిళా రాష్ట్ర అధ్యక్షురాలిగా నియమించిన రమణాచారికి, రాష్ట్ర కమిటీకి కృతజ్ఞతలు తెలుపుతూ సంఘం తనపై పెట్టిన బాధ్యతను సక్రమంగా, సమర్థవంతంగా నిర్వహించి సంఘాన్ని మరింత బలోపేతం చేయడానికి, మహిళా విభాగాన్ని ముందుకు తీసుకెళ్లడానికి తనవంతు సంపూర్ణ కృషిచేస్తానని హామీనిచ్చారు.

### అంజయ్యను సన్మానించిన కార్పొరేటర్ సున్నం రాజ్‌మోహన్

**అఫ్జల్‌గంజ్, జూలై 17ప్రభాతవార్త:** ఆషాడ మాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని కబుతర్‌ఖానాలోనిఅమ్మవారి దేవాలయంలో బోనాలపండుగను ఘనంగా నిర్వహించనున్నట్లు కార్పొరేటర్ సున్నంరాజ్‌మోహన్‌తెలిపారు. పాతబస్తీ ఉమ్మడి దేవాలయాల కమిటి చైర్మన్ గాజుల అంజయ్యను మర్యాద పూర్వకంగా కలిసి శాలువ కప్పి సన్మానించారు. ఈకార్యక్రమంలో అబిషేక్, రాజు, శ్రీనివాస్‌గౌడ్, దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## కూకట్‌పల్లిలో బోనాల పండుగ చెక్కుల పంపిణీ

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 17, ప్రభాతవార్త**

తెలంగాణలో సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా వైభవంగా జరిగే బోనాల పండుగ సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని అమ్మవారి దేవాలయాలకు సంబంధించి బుధవారం 105 చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వవిప్ లక్ష్మణ్ కుమార్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావులు పాల్గొని కూకట్‌పల్లి నియోజకవర్గంలోని దేవాలయ నిర్వాహకులకు అందించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ కార్పొరేటర్లు జూపల్లి సత్యనారాయణ, ముద్దం నరసింహయాదవ, ఆవుల రవీందర్‌రెడ్డి, పండాల సతీష్‌గౌడ్, మందాడి శ్రీనివాసరావు, సబేహాగౌసుద్దీన్, పి.శిరీషాబాబురావు, మాజీ కార్పొరేటర్ తూము శ్రావణ్ కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని కలిసిన ఎమ్మెల్యే గాంధీ


శ్రీనివాస్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే గాంధీ

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 17, ప్రభాతవార్త**

తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచారశాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని ఆయన నివాసంలో కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్‌తో ఇటీవల కాంగ్రెస్‌లో చేరిన శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరికెపూడి గాంధీ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటిని శాలువాతో సత్కరించారు. శేరిలింగంపల్లి నియోజకవర్గం అభివృద్ధి విషయంలో పూర్తిగా సహకరించాలని ఈ సందర్భంగా గాంధీ మంత్రిని కోరారు.

### ట్రాఫిక్ సమస్యను శాశ్వత పరిష్కారానికి కృషి : కార్పొరేటర్


స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్

**మూసాపేట్, జులై 17, ప్రభాతవార్త**

ట్రాఫిక్ సమస్యను శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ అన్నారు. బుధవారం 124 డివిజన్ పరిధిలోని శుభోదయ కాలనీలో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉందని స్థానిక వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ దృష్టికి తీసుకునిరాగా కార్పొరేటర్ వెంటనే స్పందించి కాలనీలో స్థానికులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన రహదారులైన ఉషా ముల్లపూడి రోడ్డు నుండి జగద్గిరిగుట్ట పైప్‌లైన్ రోడ్డు వైపుకు వెళ్లే వాహనాలు శుభోదయ కాలనీ మీదుగా వెళ్లడంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువైందని అన్నారు. గోవింద్ హోటల్ చౌరస్తా వద్ద సిగ్నల్ ఏర్పాటు చేసి ట్రాఫిక్‌ను నేరుగా పైప్‌లైన్ రోడ్‌కు మళ్లిస్తే సమస్య తగ్గుతుందని తెలిపారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి ట్రాఫిక్ సమస్యను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని కాలనీవాసులకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పోశెట్టిగౌడ్, అల్లురయ్య, సరవయ్య, శర్మ, రత్నం, డా.సునీల్, సుందరి, శ్యామల తదితరులు పాల్గొన్నారు.

## చెట్లను నాటుదాం పర్యావరణాన్ని కాపాడుదాం
### -డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్

**నిజాంపేట్, జులై 17, ప్రభాతవార్త**

చెట్లను నాటి పర్యావరణాన్ని కాపాడుదామని డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ధనరాజ్ యాదవ్ పేర్కొన్నారు. బుధవారం కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్ అంబీర్ లేక్ వద్ద అంబీర్ లేక్ వాకర్స్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వన మహోత్సవ కార్యక్రమానికి డిప్యూటీ మేయర్ ధనరాజ్ యాదవ్ ముఖ్య అతిథిగా విచ్చేసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భూమిపై చెట్లు విస్తృత స్థాయిలో పెంచినప్పుడే సకాలంలో వర్షాలు కురిసి పంటలు బాగా పండి రైతులు, ప్రజలంతా ఆరోగ్యంగా ఉండటంతోపాటు వాతావరణంలోని కాలుష్యాన్ని తగ్గించవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు సురేస్‌రెడ్డి, నాగవెంకట సత్యవాణి, సీనియర్ నాయకులు ఆవుల జగన్ యాదవ్, నాయకులు మంజునాథ్, దశరథ్, 191 ఎన్‌టీఆర్ నగర్ కాలనీ అధ్యక్షులు కృష్ణ, అంబీర్ లేక్ వాకర్స్ సాంబశివారావు, అశోక్, ప్రశాంత్, సామ్రాజ్య లక్ష్మి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

## కిటకిటలాడిన టిటిడి శ్రీవారి దేవాలయం

**సైఫాబాద్, జులై 17 ప్రభాతవార్త:**

తొలి ఏకాదశిని పురస్కరించుకుని లిబర్టి వద్దగల టిటిడి శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం బుధవారం భక్తులతో కిటకటలాడింది. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు పెద్ద సంఖ్యలో వచ్చి శ్రీదేవి భూదేవి సమేత శ్రీవారిని దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. సాంప్రదాయమైన వస్త్రాలను ధరించిన భక్తులు క్యూలైన్‌లో ఎంతో ఓపికగా నిలబడి శ్రీవారి దర్శనం చేసుకున్నారు. భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాల వితరణ గావించారు.

### శ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో తొలి ఏకాదశి వేడుకలు

**కెపిహెచ్‌బి కాలనీ, జులై 17, ప్రభాతవార్త**

కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని బాలాజీ నగర్ డివిజన్ ఆంజనేయ నగర్ కాలనీలో గల శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి దేవాలయంలో తొలి ఏకాదశి వేడుకలు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుండి ఆలయ ప్రాంగణంలో ప్రత్యేక పూజ కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు ఆలయ ప్రాంగణంలో హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ చౌర్మన్ కె.పాండుగౌడ్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకలకు ముఖ్య అతిథులుగా బాలాజీ నగర్ డివిజన్ కార్పొరేటర్ పగడాల శిరీషబాబురావు, మూసాపేట డివిజన్ కార్పొరేటర్ కొడిచర్ల మహేందర్, మాజీ కార్పొరేటర్ పగడాల బాబురావు, చిత్తారమ్మ దేవాలయం ఆలయ కమిటీ చైర్మన్ తూము శ్రీనివాసరావు, బాలాజీనగర్ డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షులు ప్రభాకర్ గౌడ్, ఆంజనేయ నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు మున్నాభాయ్ తదితరులు పాల్గొన్నారు.

### వంద కోట్ల కార్పొరేషన్ స్థలం కొట్టేయడానికి స్కెచ్
#### - బిజెపి మాజీ అధ్యక్షులు ఆకుల సతీష్

**నిజాంపేట్, జులై 17, ప్రభాతవార్త**

వంద కోట్ల కార్పొరేషన్ స్థలం కొట్టేయడానికి కొంతమంది స్కెచ్ వేస్తున్నారని బీజేపీ మాజీ అధ్యక్షులు ఆకుల సతీష్ ఆరోపించారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రజా ఆస్తులను కాపాడడానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అనేక చట్టాలను, వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్న తరుణంలో.. స్థానిక నాయకులు స్ఫూర్తిగా తీసుకోవల్సింది పోనిచ్చి వాటికి తూట్లు పొడుస్తున్నారన్నారు. హడావిడిగా ఎన్నికల్లో లబ్ధి పొందడానికి కార్పొరేషన్ స్థలంలో కార్యాలయం నిర్మాణం ప్రారంభోత్సవం చేసిన గత ప్రభుత్వ ప్రజా ప్రతినిధులకు ఇవన్నీ తెలియకుండా జరుగుతున్నాయా అని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా వంద కోట్ల విలువైన కార్పొరేషన్ స్థలాన్ని కాపాడనియెడల అధికారులని, ప్రజాప్రతినిధులను ప్రజాక్షేత్రంలో దోషులుగా నిలబెడతామన్నారు. ఈ కార్యక్రమంలో అమలేశ్వరి, అరుణ్ కుమార్, కవితరెడ్డి, మాధవరావు, కుమార్‌గౌడ్, ఎల్లస్వామి, మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

### పేదల పాలిట వరం సిఎం రిలీఫ్ ఫండ్ : కూన శ్రీశైలం గౌడ్

**జీడిమెట్ల, జులై 17, ప్రభాతవార్త**

నిరుపేదల పాలిట సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరంలాంటిదని మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పేర్కొన్నారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం గాజులరామారం డివిజన్ శ్రీరామ్‌నగర్‌కు చెందిన ఆశ యాలిగర్ అనే మహిళలకు మెదడులో రక్తం గడ్డకట్టడంతో శాస్త్ర చికిత్స చేయాలని వైద్యులు సూచించగా, ఆమె భర్త అశోక్ యాలిగర్ మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన శ్రీశైలం గౌడ్‌ను ఆశ్రయించగా, ఆయన తక్షణమే స్పందించి రాష్ట్రమంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ద్వారా బాధితురాలి శస్త్ర చికిత్స నిమిత్తం రూ. 2,50,000లను సీఎంఆర్ఎఫ్ ఎల్ఓసీ మంజూరు చేయించారు. సదరు భాదిత కుటుంబానికి మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని బుధవారం శ్రీశైలం గౌడ్ అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు ఆపద సమయంలో స్పందించి సహాయం చేసిన శ్రీశైలంగౌడ్‌కు ధన్యవాదాలు తెలియజేశారు.

## సిసి రోడ్డు పనులు ప్రారంభం


సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న చైర్ పర్సన్ నాగపూర్ణ శ్రీనివాస్

**నార్సింగి, జులై 17 ప్రభాతవార్త :** నార్సింగి మున్సిపాలిటీ పరిధిలోని మంచిరేవుల గ్రామంలో రూ.60.లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను బుధవారం చైర్ పర్సన్ మైలారం నాగపూర్ణ శ్రీనివాస్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడడం లేదని, కుల,మత, రాజకీయాలకు అతీతంగా పనులు చేస్తున్నామని వివరించారు. మున్సిపల్ పరిధిలో ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే స్థానిక కౌన్సిలర్లకు సమాచారం ఇవ్వాలని, త్వరితగతిన ఆ సమస్యను పరిష్కరిస్తామని స్పష్టం చేశారు. కౌన్సిలర్లు, అధికారుల సహకారంతో వేగంగా మున్సిపాలిటీలో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని తెలిపారు. ఎన్నికల వేళ మంచిరేవుల గ్రామస్థులకు ఇచ్చిన ప్రతీ హామీని చేతల్లో చేసి చూపిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లంకల పద్మా విరారెడ్డి, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీరాములు, మాజీ వార్డు సభ్యులు దొబ్బ లక్ష్మణ్, రవి, శ్రీనివాస్, యూత్ సభ్యులు థామస్, శశిధర్‌రెడ్డి, కిరణ్, ప్రశాంత్‌రెడ్డి, రాజు గౌడ్, జయరాజు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

## సంక్షేమ సంఘం ఎన్నికల్లో పలువురు నామినేసన్


వివేకానందనగర్ సంక్షేమ సంఘం అధ్యక్షునిగా నామినేషన్ దాఖలు చేస్తున్న బొల్లు శ్రీనువాస్‌రావు.

**యూసుఫ్‌గూడ, జులై 17, ప్రభాతవార్త :**

ప్రతి రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే కాలనీ ఎన్నికల్లో భాగంగా వివేకానందనగర్ కాలనీ సంక్షేమ సంఘం ఎన్నికలు ఆగష్టు 4వ తేదీన నిర్వహించనున్నారు. ఇందుకు గాను బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. కాలనీకి చెందిన బొల్లు శ్రీనువాస్‌రావు తన మద్దతు దారులతో కలిసి శ్రీ ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయం అమ్మవార్ల దేవాలయాలలో పూజలు నిర్వహించి భారీ ర్యాలీగా తరలి వెళ్ళి కమ్యూనిటీ హాల్‌లో ఎన్నికల అధికారులకు నామినేషన్ పత్రాలు అందజేశారు. ఆయనకు మద్దతుగా రోనంకి జగన్నాథం, తుంగం శ్రీనువాస్‌రావు, ప్రసన్నాంజనేయులు, గుత్తికొండ రామకృష్ణ, శేషారావు, రోషయ్య, లక్ష్మణ చారి, యి.సత్యనారాయణతో పాటు ఈటీమ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఈ ఎన్నికలకు ఎన్నికల అధికారులుగా సామా కొండల్‌రెడ్డి, అసిస్టెంటులుగా రామచంద్రారెడ్డి, నాగిరెడ్డిఅప్పారువులు వ్యవహరిస్తున్నారు.

**నామినేషన్ వేసిన మస్తాన్ రెడ్డి**

శ్రీవివేకానందనగర్ కాలనీలో సంక్షేమ సంఘం ఎన్నికలకు అధ్యక్షుని పోటీలో దేవరింటి మస్తాన్‌రెడ్డి తన నామినేషన్‌ను ఎన్నికల అధికారులకు అందజేశారు. అంతకుముందు తన మద్దతు దారులతో శ్రీ వెంకటేశ్వరస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి బ్యాండు మేళాలతో ర్యాలిగా తరళివెళ్ళి ఎన్నికల అధికారులకు నామినేషన్ దాఖలు చేశారు. అతనికి మద్దతుగా మొయినుద్దీన్, రవిముదీరాజ్, శ్రీనువాస్‌రెడ్డి, ఆదినారాయణ, కనకయ్య ముదిరాజ్, కృష్ణ మూర్తి, చెల్లయ్య, అగతముడి రమేష్, కెల్లా వెంకటరావు, పాల్గొన్నారు.

## బాధితులకు రికవరి సెల్‌ఫోన్‌లు అందజేత

**చిక్కడపల్లి, జులై 17 ప్రభాతవార్త:**

చిక్కడపల్లి పోలీసుస్టేషన్‌లో సెల్‌ఫోన్ చోరీకి గురైన బాధితులలో వందల సంఖ్యలో రికవరీ చేసి వారికి తిరిగి అందించడం జరిగిందని స్థానిక ఇన్‌స్పెక్టర్ ఏరుకొండ సీతయ్య అన్నారు. చిక్కడపల్లి పోలీసుస్టేషన్ పరిధిలో సెల్‌ఫోన్ చోరీకి గురైందని 20 రోజుల కింద ఆనంద్ అనే వ్యక్తి సెల్‌ఫోన్ చోరీకి గురైందని ఫిర్యాదు చేశారు. ఫిర్యాదును స్వీకరించిన పోలీసులు ఆచూకి కనుగొని సెల్‌ఫోన్‌ను రికవరీ చేసి బాధితులకు అందించగా వారు సంతోషం వ్యక్తం చేయడంతో పాటు చిక్కడపల్లి పోలీసులకు కృతజ్ఞతలు తెలిపారు.

## భూదాన యజ్ఞ బోర్డు పునరుద్ధరణకు ముఖ్యమంత్రి కృషి : చిన్నారెడ్డి


సభలో ప్రసంగిస్తున్న డా. చిన్నారెడ్డి

**సైఫాబాద్, జులై 17 ప్రభాతవార్త:**

రాష్ట్రంలో భూదాన యజ్ఞ బోర్డు పునరుద్ధరణకు కృషి చేస్తానని, అన్యాక్రాంతమైన భూదాన భూములను తిరిగి బోర్డుకు అప్పగించడం, అమరవీరుల చరిత్రను పాఠ్యాంశాలలో చేర్చడం, వారి విగ్రహాల ఏర్పాటు తదితర అంశాలను సిఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకువెళ్ళి అమలుకు పాటు పడతానని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డా.చిన్నారెడ్డి చెప్పారు. భూదాన రామచంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో జరిగిన రామచంద్రారెడ్డి 119వ జయంతి సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. భూదాన ఉద్యమానికి బీజం వేసిన రామచంద్రారెడ్డి మహోన్నతమైన లక్ష్యంతో ఏర్పాటు చేసిన భూదాన బోర్డును పునరుద్ధరించడం వల్ల ఎంతో మంది పేదలకు న్యాయం జరుగుతుందన్నారు. ప్రజా సేవే లక్ష్యంగా పనిచేసిన తెలంగాణ సాయుధ పోరాటం, భూదాన ఉద్యమం, తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమ వీరుల కుటుంబాలకు చెందిన వారసులు తమ ప్రజా సేవను కొనసాగించేందుకు రాజకీయాల్లోకి రావాలని పిలుపునిచ్చారు. ఈ సభలో ఆల్ ఇండియా సర్వసేవా సంఘ్ మేనేజింగ్ ట్రస్టీ మహాదేవ్ విద్రోహి, భూదాన రామ చంద్రారెడ్డి మెమోరియల్ ట్రస్టీ డాక్టర్ వెదిరె ప్రభోద్ చంద్రారెడ్డి, సంఘ్ జాతీయ అధ్యక్షుడు వెదిరె అరవింద్‌రెడ్డి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటి కలెక్టర్ డాక్టర్ ఎ.నరసింహారెడ్డి, తెలంగాణ భాషా, సాంస్కృతిక మండలి చైర్మన్ డాక్టర్ గంటా జలంధర్‌రెడ్డి, సంఘ్ కార్యదర్శి ఎ.రవీంద్రాచారి, తెలంగాణ రాష్ట్ర కన్వీనర్ టి.కృష్ణాగౌడ్ పాల్గొన్నారు.

## బస్తీల్లోని సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే శ్రీగణేష్


మడ్ ఫోర్ట్ ప్రాంతంలో పర్యటిస్తున్న ఎమ్మెల్యే శ్రీగణేష్.

**బేగంపేట జులై 17,ప్రభాతవార్త**

కంటోన్మెంట్ నియోజకవర్గం పరిధిలోని ఉత్తరయ్య హట్స్, కొమురయ్య హట్స్, అంబేద్కర్ హట్స్ బస్తీలలో కంటోన్మెంట్ నియోజకవర్గం ఎమ్మెల్యే శ్రీగణేష్ బుధవారం పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా బస్తీలలోని సమస్యలను బస్తీ వాసులను అడిగి తెల్సుకున్నారు. ఈ సందర్భంగా బస్తీ వాసులు డ్రైనేజ్, రోడ్లు, తాగునీటి సదుపాయం, దోమల బెడద, నల్లాలు సమస్యలు పరిష్కరించాలంటూ ఎమ్మెల్యే దృష్టికి తీసుకు వచ్చారు. స్పందించిన ఎమ్మెల్యే శ్రీగణేష్ మాట్లాడుతూ గుడిసె వాసులు ఎదుర్కొంటున్న అన్ని సమస్యలను అధికారుల దృష్టికి తీసికెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయనున్నామని అన్నారు. బస్తీలో తాగు నీటి ట్యాంకు పగిలిపోయి ఉండటాన్ని గమనించిన ఎమ్మెల్యే వెంటనే సంబంధిత అధికారులతో మాట్లాడి కొత్త ట్యాంకు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం ఉత్తరయ్య హట్స్ బస్తీ వాసి ప్రమాద వశాత్తు కాళ్లు పడిపోవడంతో మంచానికి పరిమితమయ్యాడని తెల్సుకున్న ఎమ్మెల్యే శ్రీగణేష్ బాధితుడిని పరామర్శించి స్పందించి వెంటనే ఆర్థిక సహాయం అందించారు. మెరుగైన వైద్యం కోసం గాంధీ ఆస్పత్రి సూపరిండెంట్ తో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, ఆయా బస్తీల వాసులు పాల్గొన్నారు.

### అంగన్‌వాడి కార్మికుల రిటైర్మెంట్ బెనిఫిట్ ప్రకటనను స్వాగతిస్తున్నాం : సిపిఐ, ఎఐటియూసి

**జగద్గిరిగుట్ట, జులై 17, ప్రభాతవార్త**

అంగన్వాడి టీచర్లకు, ఆయాల రిటైర్మెంట్ బెనిఫిట్‌ను 50 వేల నుండి 2 లక్షలు, లక్ష రూపాయలు పెంచుతామని మంత్రి సీతక్క ప్రకటించడాన్ని సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు స్వాగతించారు. బుధవారం జగద్గిరిగుట్ట సీపీఐ కార్యాలయంలో సీపీఐ, ఏఐటీయూసీ నాయకులు మీడియా సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేవలం ప్రకటనలకే కాకుండా వెంటనే జీవో జారీ చేయాలని కోరారు. ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అంగన్వాడీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎన్నో ఉద్యమాలు చేశామన్నారు. గత ప్రభుత్వంలో కూడా అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలని ఎన్నిసార్లు కోరిన ఆ సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే సమస్యలు పరిష్కరిస్తామని చెప్పి ఆరు నెలలు గడిచిన ప్రకటించకపోవడంతో గత నెల రోజులుగా అంగన్వాడీ కార్మికులు తమ డిమాండ్ల సాధన కోసం ఉద్యమిస్తుంటే స్పందించి మంత్రి ప్రకటించడం ఇది కార్మికుల విజయమని అన్నారు.

**అక్రమ కట్టడాలను కూల్చివేస్తామని కమీషనర్ చెప్పడాన్ని స్వాగతిస్తున్నాం..**

ప్రభుత్వ భూములు, చెరువుల పరిరక్షణకు ఏర్పాటు చేసిన హైడ్రా నేతృత్వంలో భూములు, చెరువుల కబ్జాలను అరికట్టాలని, హైడ్రా కమీషనర్ రంగనాథ్ పరికిచెరువు, మహాదేవపురంలో అక్రమ కట్టడాలను కూలల్చివేస్తామని చెప్పడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. ఈ రెండు నిర్మాణాలే కాకుండా ఇంకా పలుచోట్ల జరుగుతున్న జరుగుత్ను కబ్జాల, అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి ఉమా మహేష్, ఏఐటీయూసీ ఉపాధ్యక్షుడు ఏసురత్నం, సీపీఐ కోశాధికారి సదానంద, కార్యవర్గ సభ్యులు ఏఐటీయూసీ అధ్యక్షుడు హరినాథ్, మున్సిపల్ అధ్యక్షుడు రాములు, శాఖ కార్యదర్శి సహదేవ్‌రెడ్డి, ప్రజానాట్య మండలి అధ్యక్షుడు బాబు, ఏఐటీయూసీ నాయకులు సామెల్, రామస్వామి తదితరులు పాల్గొన్నారు.

## బోనాల ఉత్సవాలకు చాలిచాలని చెక్కుల పంపిణీ

**-నల్లపోచమ్మ టెంపుల్ కమిటీకి కేవలం రూ. 16 వేలేనా..**
**-అదికూడా సంతకం లేని చెక్కు ఇచ్చిన అధికారులు**


నల్లపోచమ్మ టెంపుల్

**తార్నాక, జులై 17 ప్రభాతవార్త:**

బోనాల ఉత్సవాల ఖర్చుల కోసం ప్రభుత్వం ఇచ్చే చెక్కులను అధికారులు తమకు నచ్చిన విధంగా ఇష్టానుసారంగా ఇస్తున్నారు. చిన్న ఆలయాలకు లక్షల్లో ఇస్తూ భక్తులు అధికంగా వచ్చి బోనాలు సమర్పించే ఖర్చు ఎక్కువయ్యే ఆలయాలకు అరకొరగా చెక్కులను పంఫిణీ చేస్తున్నారు. నగరంలోని పలు చోట్ల ఇదేవిదంగా చెక్కులను పంపిణీ చేస్తూ ఆలయ నిర్వాహకుల ఆగ్రహానికి గురౌతున్నారు. తమ గుడికి సుమారు రెండు లక్షల ఖర్చు వస్తుందని సంభందిత అధికారులు, ప్రజాప్రతినిధులను వేడుకున్నప్పటికి చాల ఆలయాలకు కేవలం రూ. 15వేల నుంచి 20వేల లోపే చెక్కులను ఇస్తున్నారు. మంత్రుల సిఫార్సులున్న, ఉన్నతాధికారుల రికమండేషన్లు... లంచాలు ఇచ్చిన వారికి మాత్రంలో రూ.లక్ష నుంచి రెండు లక్ష వరకు చెక్కులను ఇస్తున్నారు. ఇదేమిటని అధికారులను ప్రశ్నిస్తే సరైన సమాదానం లేదని పలువురు ఆలయ కమిటీ వారు వాపోతున్నారు. ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపు నెం.6 పరిధిలోని ప్రధాన రోడ్డులు ఉన్న ఎంతో మహిమ కల్గిన వేలాది మంది బోనాలు సమర్పించే శ్రీ నల్ల పోచమ్మ టెంపుల్ కమీటి ఆలయానికి అధికారులు కేవలం రూ. 16 వేల ఐదు వందలు మాత్రమే ఇచ్చారని టెంపుల్ కమిటీ అధ్యక్షుడు జింకల హరికృష్ణ ఆరోపించారు. చెక్కుపై సంతంలేకుండా అధికారులు ఇచ్చారని తమ ఆవేదన వ్యక్తం చేశారు. బోనాల ఉత్సవాల సమయం దగ్గరపడిందని నిర్వాహణ ఖర్చులు ఏవిదంగా తీసుకురావాలని ఆయన ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ ఆలయానికి భక్తుల రద్దీ వీపరీతంగా ఉంటుందని బోనాల ఉత్సవాలకు లైట్లు, మైకు, బ్యాండ్, పలహారం బండి ఊరేగింపు, గుడి మరమ్మతు ఖర్చులు సుమారు... 2,7000 లక్షల ఖర్చు వస్తుందని స్థానిక ఎమ్మెల్యే టి.పద్మారావు గౌడ్, సంభందిత అధికారులకు లెక్కలతో పాటు తమకు అయ్యేఖర్చులపై వినతి పత్రాన్ని అందజేసినా తమకు కేవంలో రూ. 16 వేలు మాత్రమే ఇచ్చారని ఆయన వాపోయాడు.

## ట్రాఫిక్ సిబ్బందికి కమిషనర్ సత్కారం

**హైదరాబాద్, జులై 17, ప్రభాతవార్త:**

మీర్‌పేట వద్ద జరిగిన ప్రమాదంలో ప్రాణనష్టం జరగనివ్వని వనస్థలిపురం ట్రాఫిక్ పోలీస్ సిబ్బందిని రాచకొండ కమీషనర్ జి. సుధీర్‌బాబు అభినందించారు. విధి నిర్వహణలోని ప్రతీ పోలీసు ఇలాగే సమయస్ఫూర్తిని కొనసాగించాలన్నారు. రాచకొండ కమీషనరేట్ కార్యాలయంలో వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులకు బుధవారం రివార్డులతో సత్కరించారు. ఈ సందర్భంగా కమీషనర్ మాట్లాడారు. విధి నిర్వహణలో వేగంగా తీసుకునే సరైన నిర్ణయం ఎంతో మేలు చేస్తుందనీ, ట్రాఫిక్ పోలీసులకు సమయస్ఫూర్తిని కొనియాడారు. ముందు ముందు కూడా ఇదే విధంగా సమయస్ఫూర్తిని కొనసాగించాలని సూచించారు. వివరాల్లోకి వెళ్తే, జూలై 15వ తేదీన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆర్‌సీఐ రోడ్‌లో వెంకటేశ్ అనే వ్యక్తి ప్రయాణిస్తున్న కారులోని ఏసీ లోంచి అకస్మాత్తుగా మంటలు రావడంతో, అక్కడే విధులు నిర్వహిస్తున్న ట్రాఫిక్ పోలీసులైన నర్సింగరావు, కృష్ణ, సాయిరామ్‌లు గమనించారు. తక్షణమే హుటాహుటీన కారును ఆపి, దానిని నడుపుతున్న వ్యక్తిని అప్రమత్తం చేసి, అతడి ప్రాణాలు కాపాడారు. కారు నుంచి వచ్చే మంటలు ఎక్కువవ్వడంతో అటుగా ఏ వాహనాలనూ వెళ్ళకుండా ఆపడంతో ఎటువంటి ప్రాణ నష్టం జరగలేదు. అనంతరం వెంటనే ఫైర్ సిబ్బందికి ఫోన్ చేయడమే కాకుండా, అటుగా వెళ్తున్న వాటర్ ట్యాంకర్‌ను ఆపి మంటలను అదుపు చేయడానికి తమ వంతు కృషి చేశారు.

### రాయదుర్గం పోలీసులను ఆశ్రయించిన సంధ్య శ్రీధర్‌రావు

**గచ్చిబౌలి, జులై 17 ప్రభాతవార్త :** తప్పుడు పత్రాలు సృష్టించి తనను మోసం చేశారంటూ సంధ్య కన్‌స్ట్రక్షన్స్ యజమాని శ్రీధర్ రావు రాయదుర్గం పోలీసులను ఆశ్రయించాడు. తన సంస్థ నిర్మించిన సంధ్య టెక్నో వన్‌లో ఓ ఫ్లోర్ కొనుగోలు చేసిన వ్యక్తి, తన సంస్థలో పనిచేసే వ్యక్తితో కలిసి నకిలీ పత్రాలను సృష్టించి మొత్తం భవనాన్ని కొనుగోలు చేసినట్లుగా మోసానికి పాల్పడుతున్నాడని వాపోయాడు. శ్రీధర్‌రావు పిర్యాదు ప్రకారం... రాయదుర్గంలో సంధ్య కన్‌స్ట్రక్షన్స్ సంస్థ నిర్మించిన సంధ్య టెక్నోవన్‌లో 2021లో మాలికిరెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి అనే వ్యక్తి ఓ ఫ్లోర్‌ను కొనుగోలు చేశాడు. సంధ్య కన్‌స్ట్రక్షన్స్‌లో మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్‌గా పనిచేస్తున్న కొమ్మారెడ్డి ఠాగూర్‌తో కలిసి మొత్తం భవనాన్ని కొనుగోలు చేసినట్లు తప్పుడు పత్రాలు సృష్టించి మోసానికి పాల్పడుతున్నాడని శ్రీధర్‌రావు రాయదుర్గం పోలీసులను ఆశ్రయించాడు. వీరు ఇరువురితో పాటు వీరికి సహకరించిరంటూ మరికొందరిపై పోలీసులకు పిర్యాదు చేయగా, రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

## చిన్నారికి కాలేయ మార్పిడి చేసిన ఉస్మానియా వైద్యులు

**-ఇప్పటి వరకు 8మంది చిన్నారులకు, మరో30మందికి కాలేయమార్పిడి చిక్సితలు చేసిన వైద్యబృందం**

**అఫ్జల్‌గంజ్, జూలై17ప్రభాతవార్త:**

ఉస్మానియా ఆసుపత్రిలో ఓచిన్నారికి కాలేయ మార్పిడి శస్త్రచికిత్స చేసి మరోసారితమకు సాటిలేరని ఉస్మానియా ఆసుపత్రి వైద్యులు నిరూపించుకున్నారు. సర్జికల్ గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ మధుసూధన్ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం, కొండవనమాల గ్రామానికి చెందిన మోదుగు గుణశేఖర్, అమల దంపతుల కుమారుడు మాస్టర్ చోహన్‌అధిత్య (3)సంవత్సరాలు. పుట్టకతోనే పిత్తాశయ ధమని, కాలేయ సమస్యతో భాదపడుతున్నాడు. చోహన్ అధిత్యను పరిశీలించిన ఉస్మానియాఆసుపత్రి గ్యాస్ట్రోఎంటరాలజీ విభాగం అధిపతి ప్రొఫెసర్ మధుసూధన్ వైద్య బృందం ఈనెల 3వతేదిన అధిత్యకుకాలేయ మార్పిడి చికిత్సను విజయవంతంగా పూర్తి చేసింది. అధిత్యకు తల్లి అమల కాలేయాన్ని తన కుమారునికి దానం చేయడంతో కొంత భాగాన్ని తీసుకుని బాలున్నికి అమర్చారు. ప్రస్తుతం తల్లి అమల, కుమారుడు అధిత్యక్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. వారిని మంగళవారం ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ చేసినట్లు తెలిపారు. కాగాఇప్పటి వరకు ఉస్మానియా ఆసుపత్రిలో 8మంది చిన్నారులతోపాటు 30మందికి కాలేయ మార్పిడి చికిత్సలువిజయవంతం చేసినట్లు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి, ఆరోగ్యశాఖమంత్రి దామోదర రాజనర్సింహా, వైద్యసంచాలకులకు, ఉస్మానియా ఆసుపత్రి సూపరిండెంటెంట్ డాక్టర్ బి.నాగేందర్, చికిత్సలో అనస్థిసియా వైద్యబృందానికి కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## పాతబస్తీలో షర్బత్‌లు,ఆహార ప్యాకెట్లు పంపిణీ


మొహరం ఊరేగింపు సందర్భంగా షర్బత్‌లు,ఆహార ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

**చార్మినార్, జూలై 17 ప్రభాతవార్త :**

మొహరం ఊరేగింపు సందర్భంగా బుధవారం హైదరాబాద్ పాతబస్తీలోని పలు ప్రాంతాలలో వేదికలు ఏర్పాటు చేసి బీబీకా ఆలంకు స్వాగతం పలికారు. ఊరేగింపులో పాల్గొన్న షియా ముస్లింలకు పలు స్వచ్ఛంధ సంస్థలు మంచి నీరుతో పాటు షర్బత్‌లు పంపిణీ చేశారు. మొహరం ఊరేగింపు సందర్భంగా పాతబస్తీలో దక్షిణ మండలం పోలీసులు గట్టి బందోబస్తును ఏర్పాటు చేశారు. మహ్మద్ క్యాప్ మార్ట్ ఆధ్వర్యంలో మదీనా సర్కిల్ వద్ద టెంట్ ఏర్పాటు చేసి ప్రజలకు షర్బత్‌లు, ఐస్‌క్రీమ్‌లు, భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మహ్మద్ క్యాప్ మార్ట్ ఎండి మహ్మద్ ఇలియాస్ బుఖారీ మాట్లాడుతూ ప్రజలు ఐకమత్యంతో ఉత్సవాలను జరుపుకుంటున్నారని తెలిపారు.

### పాతబస్తీలో పర్యటించిన విద్యుత్ అధికారులు


చార్మినార్ వద్ద విద్యుత్ శాఖాధికారులు

**చార్మినార్, జూలై 17 ప్రభాతవార్త :**

మొహరం ఊరేగింపు సందర్భంగా హైదరాబాద్ పాతబస్తీలో బుధవారం విద్యుత్ శాఖాధికారులు విద్యుత్ ఏర్పాట్లను పరిశీలించారు. చార్మినార్, మదీనా ప్రాంతాలలో విద్యుత్ అధికారులు పర్యటించారు. ఈ సందర్భంగా దక్షిణ మండలం ఎస్ఈ పి. మోహన్‌రెడ్డి మాట్లాడుతూ మొహరం ఊరేగింపు సందర్భంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండ అన్ని ఏర్పాట్లు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో చార్మినార్ టిజిఎస్‌పిడిసిఎల్ డిఇ టి.లింగయ్య గౌడ్, డిఇ డిపి ఫర్హత్ అలీ, చార్మినార్ సిబిడి ఎడిఇ మహ్మద్ అఫ్జల్, ఫలక్‌నుమా సిబిడి ఎడిఇ మధూధన్‌రెడ్డితో పాటు పలువురు పాల్గొన్నారు.

### చిక్కడపల్లి శ్రీవారి ఆలయంలో తొలి ఏకాదశి వైభవ శోభ
#### -పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే ముఠాగోపాల్


ఆలయలో పూజలు నిర్వహిస్తున్న ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్

**చిక్కడపల్లి, జూలై 17 ప్రభాతవార్త:**

తొలి ఏకాదశి సందర్భంగా గురువారం చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాలయాన్ని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం వ్యవస్థాపక వంశీయులు స్వర్గీయ జి.రాజేంద్రనాథ్‌గౌడ్ కుమారుడు, ఆలయం వంశీయుకులు గుడిదేవుని శ్రీనాథ్‌గౌడ్, ఈవో రామాంజనేయులు పర్యవేక్షణలో ఉత్సవం కన్నులపండువగా సాగింది. తెల్లవారుజామున నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరై పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తొలి ఏకాదశి సందర్భంగా ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠాగోపాల్ శ్రీవారి ఆలయాన్ని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయంలో పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం నిర్వాహకులు స్వామివారి తీర్థప్రసాదాలను అందించారు. బిఆర్ఎస్ ముషీరాబాద్ ఇంచార్జ్ ముచ్చకుర్తిప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భక్తులు అర్చనాది కార్యక్రమాలతో, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు స్వామివారి తీర్థ తీర్థప్రసాదాలను స్వీకరించారు.

## రూ.3కోట్ల చీటింగ్ కేసులో నిందితురాలి అరెస్ట్

**హైదరాబాద్, జులై 17, ప్రభాతవార్త:**

ఆర్థిక సలహాదారి పేరుతో రూ.3 కోట్లు దండుకుని మోసం చేసిన నిందితురాలిని సైబరాబాద్ ఆర్థిక నేరాల విభాగం పోలీసుల అరెస్ట్ చేశారు. డిప్యూటీ కమిషనర్ కే.ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం, తనని తాను ఎన్ఆర్ఐగా పరిచయం చేసుకున్న సేర్లింగంపల్లికి చెందిన పానుగంటి ఇందిరాదేవి(29) అనే మహిళ మదీనాగూడాకు చెందిన ఎస్.సత్యనారాయణకు ఆర్థిక సలహాల పేరుతో వివిద లావాదేవీలు జరిపింది. తన పేరు మీద బ్యూటీ పార్లర్‌తో పాటు దేవీ ఫుడ్స్ పేరుతో నాగోలులో ఆహార పరిశ్రమ ఉన్నట్లు చెప్పుకొచ్చింది. అంతే కాకుండా మాదాపూర్, గచ్చిబౌలి, నార్సింగి ప్రాంతాలలోని గేటెడ్ కమ్యూనిటీలలో ఆస్థులున్నట్లు నమ్మించింది. ఈ క్రమంలో బాధితుడికి అధిక లాభాల ఆశ చూపి అతని వద్ద నుంచి రూ.3.6 కోట్లు తీసుకోవడంతో పాటు అతడికి చెందిన రెండు కార్లను తనఖా పెట్టింది. అంతే కాకుండా బాధితుడితో ఐఫోన్, వన్‌ప్లస్ ఫోన్లను కొనిపించి, తన భద్రత కోసం ఇద్దరు నకిలీ పోలీసులను తన మిత్రులుగా అతడికి పరిచయం చేసింది. ఈ క్రమంలో అతడి వద్ద తీసుకున్న డబ్బులో నిందితురాలు పెట్టుబడులు పెట్టలేదని తెలుసుకుని, తన మూడు కోట్లు, వాహనాలు తిరిగివ్వమని అడుగగా, ఆమె ముఖం చాటేసింది. అంతేకాకుండా బాధితుడిని తప్పుడు కేసుల్లో ఇరికిస్తానని బెదిరింపులకు పాల్పడింది. దాంతో బాధితుడు సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, నిందితురాలిని అరెస్ట్ చేసిన పోలీసులు ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## తెలంగాణ ఉద్యమకారుడు, గాయకుడు వేముల నరేశ్ మృతి

**హైదరాబాద్, జులై 17, ప్రభాతవార్త:** తెలంగాణ ఉద్యమకారుడు, అరుణోదయ సంస్కృతిక సంస్థ మాజీ నాయకుడు వేముల నరేశ్ మృతి చెందాడు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాదులో నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి కన్ను మూశారు. ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొని ఎన్నో వేధికలపై తన పాటలతో ప్రజలను చైతన్య పరిచిన గొంతు శాశ్వతంగా మూగబోయిందంటూ తెలుగు కళాకారులు, ఆయన అభిమానులు నరేశ్ మృతి పట్ల నివాళులర్పించారు. 2003-04 సంవత్సర కాలంలో నల్గొండ జిల్లా యురేనియం తవ్వకాలకు వ్యతిరేకంగా జరిగిన పాదయాత్రతో వేముల నరేశ్ తొలిసారి తెరపైకి వచ్చారు. తెలంగాణ ఉద్యమకారులకు స్ఫూర్తినిచ్చే విధంగా పాటలు పాడడంలో నరేశ్‌ది ప్రత్యేక శైలి అని, అన్నీ తానై వేధిక మొత్తాన్ని నడిపించిన విజయవంతమైన ప్రదర్శనలను ఆయన అభిమానులు గుర్తు చేసుకున్నారు. ఎంతో మంది తెలుగు కళాకారులను తెలంగాణ ఉద్యమంలోకి తీసుకొచ్చిన నరేశ్ మరణం కళారంగానికి తీరని లోటుగా భావించి సంతాపం తెలియజేశారు.

## జవహర్‌నగర్‌లో పెరిగిపోతున్న వీధి కుక్కలు

### పట్టించుకోని మున్సిపల్ అధికారులు.. చర్యలు తీసుకోవాలని చిన్నారుల తల్లిదండ్రుల ఆందోళన..



జవహర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త : జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో వీధి కుక్కల బెడద రోజురోజుకి విపరీతంగా పెరిగిపోతుంది. చిన్నారులు ఒంటరిగా కనిపిస్తే వారిపై దాడులకు దిగి చివరికి వారి ప్రాణాలకు శాపంగా మారాయి. ఇటీవల జవహర్‌నగర్ మున్సిపల్ పరిధిలోని వికలాంగుల కాలనీలో 12నెలల బాలుడిపై వీధి కుక్కలు విపరీతంగా దాడి చేయడంతో ఆసుపత్రికి తీసుకువెళ్లిన ఫలితం లేకపోయింది. 12నెలల బాలుడు చనిపోయాడు. గత కొన్ని నెలలుగా మున్సిపల్ పరిధిలోని డివిజన్లలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ఒంటరిగా తిరుగుతున్న వారిపై దాడులు చేస్తున్నాయి. ఇంత జరుగుతున్న మున్సిపల్ అధికారులు మాత్రం చోద్యం చూస్తున్నారని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వీధి కుక్కలు చిన్నారులపై దాడులు జరపకుండా తగిన చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా గరిక సుధాకర్



ప్రొ.కోదండరాంనుంచి నియామక పత్రం అందుకుంటున్న సుధాకర్ తదితరులు

ఉప్పల్, జూలై 17 ప్రభాతవార్త : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మేడ్చల్ జిల్లా కన్వీనర్‌గా ఉప్పల్ సర్కిల్‌కు చెందిన గరిక సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్‌రావు, టిజెసి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొ.కోదండరాం నుంచి నియామక పత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో గరిక సుధాకర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన ఉద్యమకారులకు కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తగు చేయూత అందిస్తుందన్నారు. ఉద్యమకారులకు చేయూత అందించడంతోపాటు, నామినేటెడ్ పదవులలో న్యాయం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉద్యమకారులు భాస్కర్‌రావు, అనంతలక్ష్మి, గగన్‌కుమార్, కిరణ్, యాదిరెడ్డి, స్వామి, నరేందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణలో ప్రజల పాత్ర కీలకం : ఎస్ఐ, సిఐలు



ఎస్ఐ గంగాధర్‌రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న ప్రవీణ్‌రెడ్డి

సైదాబాద్, జూలై 17 ప్రభాతవార్త: సరూర్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో సెక్టార్-3 ఎస్ఐ గా బాధ్యతలు చేపట్టిన గంగాధర్‌రెడ్డిని లింగోజిగూడ డివిజన్ కాంగ్రెస్ నాయకులు ప్రవీణ్‌రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ సైదిరెడ్డి, ఎస్ఐ గంగాధర్‌రెడ్డిలు మాట్లాడుతూ శాంతి భద్రతలు కాపాడడంలో ప్రజల సహకారం చాలా ముఖ్యమన్నారు. ఈ కార్యక్రమంలో రోహిత్‌రెడ్డి, శ్రీనాథ్, రాజు, నరేందర్ పాల్గొన్నారు.


## సమస్యలపై దృష్టి సారించండి : ఆకుల



స్థానికులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ శ్రీవాణిఅంజన్‌కుమార్

ఎల్.బి.నగర్, జూలై 17 ప్రభాతవార్త: డివిజన్ పరిధిలోని పలు కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరించేందుకు అధికారులు దృష్టి సారించాలని సరూర్‌నగర్‌డివిజన్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణిఅంజన్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. డివిజన్ పరిధిలోని అంబేద్కర్‌నగర్ కాలనీలో పర్యటించి స్థానికులతో సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలోని సమస్యలను విడుదలవారిగా పరిష్కరించేందుకు సంబంధిత శాఖ అధికారులు పరిష్యమైన చర్యలు తీసుకోవాలని కోరారు. అధికారులు వెంటనే అభివృద్ధి పనులు చేపట్టాలని కార్పొరేటర్ సూచించారు.

## పని చేసే కార్యకర్తలకు పార్టీలో తగిన గుర్తింపు ఉంటుంది : గోపాల్‌ముదిరాజ్



చైర్మన్ శారదకు శుభాకాంక్షలు తెలుపుతున్న గోపాల్ ముదిరాజ్

సైదాబాద్, జులై 17 ప్రభాతవార్త: తెలంగాణా రాష్ట్ర మహిళా కమీషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన నేరెళ్ల శారదకు చంపాపేట డివిజన్ కాంగ్రెస్ నాయకులు గోపాల్‌ముదిరాజ్ శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం గోపాల్ ముదిరాజ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీలో పనిచేసే కార్యకర్తలకు తప్పనిసరిగా గుర్తింపు అభిస్తుందన్నారు. శుభాకాంక్షలు తెలిపిన వారిలో తుమ్మలూరు మాజీ సర్పంచ్ మద్ది కరుణాకర్‌రెడ్డి, చైతన్యరెడ్డి, శ్రీపాల్‌రెడ్డి, రాఘవేందర్‌రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.

## మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్‌కు సన్మానం



శారదను అభినందిస్తున్న మేయర్ పారిజాత

సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త: తెలంగాణ మహిళా కమీషన్ ఛైర్‌పర్సన్‌గా పదవీ బాధ్యతలు స్వీకరించిన సీనియర్ నాయకురాలు నేరెళ్ళ శారదను టిపిసిసి ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ చిగిరింత పారిజాత నర్సింహారెడ్డి సన్మానించారు. నగరంలోని బుద్ధ భవన్‌లో జరిగిన ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమానికి హాజరైన ఆమె శారదను శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛానిచ్చి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సిఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంక్షేమానికి పెద్ద పీట వేస్తున్నదని తెలిపారు.

## ఎం.బి.సి చైర్మన్‌గా జైపాల్ బాధ్యతలు



చైర్మన్ జైపాల్‌ను సన్మానిస్తున్న సుధాకర్

తుర్కయాంజాల్, జూలై 17 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల అభివృద్ధి కార్పొరేషన్ (ఎం.బి.సి) చైర్మన్‌గా నియమితులైన వడ్డెర సామజిక వర్గానికి చెందిన జెరిపేటి జైపాల్ బుధవారం హైదరాబాద్‌లోని డి.ఎస్.ఎస్ భవన్‌లో ప్రమాణ స్వీకారం చేసారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రంగారెడ్డి జిల్లా అధికారప్రతినిధి వరికుప్పల సుధాకర్ జైపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ వడ్డెర జాతిని ప్రభుత్వం గుర్తించి జైపాల్‌కు ఎం.బి.సి. చైర్మన్ పదవి ఇచ్చిందన్నారు. దీంతో సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డికి మంత్రివర్గానికి కృతజ్ఞతలు తెలిపారు. జైపాల్‌కు వరించినా ఈ పదవితో వెనుకబడిన తరగతుల కులాలతోపాటు వడ్డెర జాతి అభ్యున్నతికి తోడ్పడాలన్నారు. అదేవిధంగా యువనాయకులకు బాసటగా అండగా ఉండాలన్నారు. అనంతరం చైర్మన్ జైపాల్ మాట్లాడుతూ వెనుకబడిన తరగతుల అభ్యున్నతికి తోడ్పాటు అందించి వడ్డెర జాతి అభివృద్ధికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకుతోపాటు కార్యకర్తలు, వడ్డెర సామాజిక వర్గ ప్రజలు పాల్గొన్నారు.

## ద్వారకామాయి సాయి పీఠం ఆధ్యాత్మిక సేవలు వెలకట్టలేనివి: సామిడి గోపాల్‌రెడ్డి

సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త: మీర్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని ప్రశాంతిహిల్స్‌లోనున్న శ్రీ ద్వారకామాయి సాయిబాబా పీఠం అందిస్తున్న ఆధ్యాత్మిక సేవలు వెలకట్టలేనివని టిపిసిసి ప్రచార కమిటీ సభ్యుడు సామిడి గోపాల్‌రెడ్డి కొనియాడారు. ప్రథమ దత్తావతారమైన శ్రీపాద శ్రీవల్లభుల వంశంలో 34వ తరానికి చెందిన పీఠాధిపతి, దత్త సిద్ధాంత ఆదికర్త పూజ్యశ్రీ గోపాలకృష్ణానంద స్వామీజీ మంగళ శాసనములతో బుధవారం పీఠంలో తొలి ఏకాదశి పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా స్వామీజీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈశ్వరాభిషేకానికి హాజరైన గోపాల్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామీజీ ఆయనను సన్మానించి ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా గోపాల్‌రెడ్డి మాట్లాడుతూ తన బోధనల ద్వారా సమాజంలో మంచిని పెంచడానికి స్వామీజీ కృషి చేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి సామిడి చరణ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పార్కులలో దీపాల నిర్వాహణ సక్రమంగా ఉండాలి : కార్పొరేటర్ కొత్తకాపు అరుణ



పార్కును పరిశీలిస్తున్న కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి

సైదాబాద్, జులై 17 ప్రభాతవార్త: సైదాబాద్ డివిజన్ పరిధిలోని పార్కులలో గల వీది దీపాలను కార్పొరేటర్ కొత్తకాపు అరుణ రవీందర్‌రెడ్డి బుధవారం సంబంధిత సిబ్బందితో కలసి పరిశీలించారు. ఎస్‌బిహెచ్ ఎ కాలనీ పార్కులో తప్పు పట్టిన విద్యుత్ పోల్ స్థానంలో నూతన పోల్‌ను ఏర్పాటు చేయాలని, లోకాయుక్త కాలనీ పార్కు, ఎపిఏయు కాలనీ పార్కులలో నూతన వీది దీపాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వర్క్ ఇన్‌స్పెక్టర్ దుర్గారావు, లైన్ మెన్ దినేష్ తదితరులు పాల్గొన్నారు.

## కార్పొరేటర్ మనోహర్‌కు పితృ వియోగం

సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త: బడంగ్‌పేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని 18వ డివిజన్ కార్పొరేటర్ బండారి మనోహర్‌కు పితృ వియోగం కలిగింది. ఆయన తండ్రి అయిన బాలాపూర్ గ్రామానికి చెందిన కురుమ కుల పెద్దలు బండారి మాలప్ప దీర్ఘకాల అనారోగ్య సమస్యలతో బుధవారం మధ్యాహ్నం తుది శ్వాస విడిచారు. దీంతో గ్రామంలో విషాద ఛాయలు అలముకున్నాయి. ఈ మేరకు గ్రామానికి చెందిన పలువురు నాయకులు ఆయన భౌతిక కాయానికి నివాళులర్పించి కార్పొరేటర్ మనోహర్‌ను పరామర్శించారు.

## శ్రీ సాయినగర్ సంఘం నూతన కార్యవర్గ ఎన్నిక

నేరెడ్‌మెట్, జూలై 17 ప్రభాతవార్త : వినాయక్‌నగర్ డివిజన్ పరిధిలోని శ్రీ సాయినగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని గత ఆదివారం సలహాదారులు ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగిందని సలహాదారులు రంపె చంద్రమౌళి పేర్కొన్నారు. అధ్యక్షులుగా బుగ్గ ఉపేందర్, ప్రధాన కార్యదర్శిగా గ్యారల రమేష్, కోశాధికారిగా తాటి సుభాష్‌గుప్తా, ఉపాధ్యక్షులుగా వెంకటేష్‌చారి, రొయ్యల క్రిష్ణ, ఆకుల ప్రభాకర్, రాళ్ళబండి నరేంద్రచారి, సహాయ కార్యదర్శులుగా శ్యామల వెంకటేష్, సింగం వెంకటేష్, మరికుక్కల బాలరాజు, మెతుకు ధన్‌రాజ్, ప్రచార కార్యదర్శులుగా పట్టుర్తి సోమేష్, రొయ్యల మహేష్, శ్యామల దశరథ్, వడ్డె పాండు, వంగరి శ్రీను, కార్యవర్గ సభ్యులుగా కాళ్ళే మల్లేష్, వగ్గు సత్తయ్య, వగ్గు మల్లేష్, పోరెడ్డి సత్యనారాయణ, కానుగంటి ఉపేందర్, సిద్దులు, సత్యనారాయణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## శివసాయినగర్‌లో లోక కళ్యాణార్థ పూజలు

సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త: తొలి ఏకాదశి సందర్భంగా బుధవారం మీర్‌పేట్ శివసాయినగర్‌లోని శ్రీ గౌరి నీలకంఠేశ్వర స్వామి సమేత లక్ష్మీ గణపతి దేవాలయంలో బుధవారం తొలి ఏకాదశి సందర్భంగా లోక కళ్యాణార్థం శ్రీ విష్ణు సహస్రనామ స్తోత్ర, ద్వాదశావృత్తి పారాయణం నిర్వహించారు. సనాతన ధర్మ ప్రవర్ధక సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో సభ్యులు సాంబశివశర్మ, వంశీ, శ్రీనివాసప్రసాద్, పార్థసారథి, గోపాలకృష్ణ, మహాలక్ష్మి, లక్ష్మణరావు, మూర్తి, రామచంద్రరావు, విశ్వనాథబాబు, రామకృష్ణ, కృష్ణారావు, రమణ, లక్ష్మీ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

## ఆనంద్‌బాగ్ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామికి దాత వెండి కవచం బహూకరణ



స్వామివారికి వెండి కవచం అందజేస్తున్న దాత

మల్కాజిగిరి, జూలై 17 ప్రభాతవార్త : ఆనంద్‌బాగ్‌లోని శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి ఆలయానికి మల్కాజిగిరి వసంతపురి కాలనీ చెందిన వెంకటసుబ్రహ్మణ్యం అనే భక్తుడు స్వామివారికి 3 కిలోల 900 గ్రాములతో చేసిన గరుడ ఆల్వార్‌కి వెండి కవచం చేయించారు. బుధవారం తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా స్వామివారికి ఆలయంలో అభిషేకం అనంతరం భక్తుడు సమర్పించిన వెండి కవచాన్ని స్వామి గరుడాల వారికి అలంకరించారు. ఆలయ కమిటీ అధికారులు ఆలయాభివృద్ధికి అహర్నిశలు పాటుపడుతూ భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రవీందర్‌రెడ్డి, ఆలయ పూజారులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి వెండి కవచం అందించిన భక్తుడికి స్వామివారి శేష వస్త్రం అందజేసి సన్మానించారు.

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి : కార్పొరేటర్ కక్కిరేణి చేతన



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న కార్పొరేటర్ చేతన తదితరులు

ఉప్పల్, జూలై 17 ప్రభాతవార్త : సీజనల్ వ్యాధుల నివారించేందుకు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని హబ్సిగూడ డివిజన్ కార్పొరేటర్ కక్కిరేణి చేతన పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం జిహెచ్‌ఎంసి ఆధ్వర్యంలో హబ్సిగూడ గాంధీ గిరిజన బస్తీలో మున్సిపల్ అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ చేతన మాట్లాడుతూ పరిసరాలలో దోమలు వ్యాప్తి చెందకుండా ఉండేందుకు విద్యార్థులు తగు జాగ్రత్తలు పాటించాలని, దోమకాటుకు గురికాకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని కోరారు. పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని, చెత్తా చెదారం, పూల కుండీలు, కొబ్బరి చిప్పలు, ఇతర వస్తువులు తొలగించాలని కోరారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ డిఇ చందన, ఎంటమాలజీ ఎఇ నరేష్‌రెడ్డి, సూపర్‌వైజర్ సుదర్శన్. రాజేశ్వర్‌రెడ్డి, శానిటరీ జవాన్లు, ఇతర సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## పేద విద్యార్థులకు ల్యాప్‌టాప్‌ల పంపిణి




ల్యాప్ టాప్‌లను అందజేస్తున్న డిసిపి ప్రవీణ్‌కుమార్

సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త: మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నందనవనంలో పేద విద్యార్థులకు అక్షయ విద్యా ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచితంగా ల్యాప్‌టాప్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఫౌండేషన్ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎల్‌బినగర్ జోన్ డిసిపి ప్రవీణ్‌కుమార్ చేతుల మీదుగా ల్యాప్‌లాప్‌లను అందజేశారు. నందనవనంఏరియాలో ఉంటున్న పేద విద్యార్థులకు అదే విధంగా ట్యూషన్లు చెప్పే కాలనీ విద్యార్థులకు మొత్తం నలభై మందికి ల్యాప్ టాప్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మీర్‌పేట్ ఇన్స్‌పెక్టర్ నాగరాజు, సెక్టార్ ఎస్ఐ రాజశేఖర్, పోలీసు సిబ్బంది, స్థానికులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో సురక్షితంగా బయటపడ్డ సామల రంగారెడ్డి

సరూర్‌నగర్, జూలై 17 ప్రభాతవార్త: సరూర్‌నగర్ మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, బాలాపూర్ మాజీ పోలీస్ పటేల్ సామల రంగారెడ్డికి తృటిలో ప్రమాదం తప్పింది. బాలాపూర్ సమీపంలోని ఆర్‌సిఐ రోడ్డులో ఆయన రోడ్డు ప్రమాదంనుండి సురక్షితంగా బయటపడ్డారు. వివరాల్లోకి వెళ్తే.. తొలి ఏకాదశి సందర్భంగా బాలాపూర్ ఆర్‌సిఐ రోడ్డులోనున్న ఎస్‌పిఆర్ లక్ష్మీ కన్వెన్షన్‌లోని సామల మందిర్ శ్రీ అభయాంజనేయ స్వామి ఆలయంలో సతీసమేతంగా ప్రత్యేక పూజలు నిర్వహించి బాలాపూర్‌లోని స్వగృహానికి వెళ్ళి తిరిగి ఆలయానికి బుధవారం మధ్యాహ్నం వస్తుండగా ఆయన ప్రయాణిస్తున్న కారు ఆర్‌సిఐ రోడ్డులో యు టర్న్ తీసుకుంటుడంగా అదే సమయంలో వేగంగా వచ్చిన తుక్కుగూడ ఫ్యాబ్ సిటీకి చెందిన బస్సు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారు ధ్వంసమైనా అదృష్టవశాత్తు రంగారెడ్డికి ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాద సమాచారం అందుకున్న బడంగ్‌పేట్ డిప్యూటీ మేయర్ ఇబ్రాం శేఖర్‌తో పాటు పలువురు గ్రామస్తులు సామలను కలిసి పరామర్శించారు.

## గంజాయి విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తుల అరెస్ట్



గంజాయి విక్రయిస్తున్న నిందితులను అరెస్ట్ చేసిన ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు

ఉప్పల్, జూలై 17 ప్రభాతవార్త : ఇతర రాష్ట్రాల నుంచి గంజాయి తీసుకుని వచ్చి ఉప్పల్ పరిసర ప్రాంతాల్లో విక్రయిస్తున్న ఇద్దరు వ్యక్తులను ఉప్పల్ ఎక్సైజ్ పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. ఎక్సైజ్ సిఐ బి. ఓంకార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిస్సా సరిహద్దు నుంచి అక్రమంగా గంజాయి తీసుకుని వచ్చి ఉప్పల్ పరిసర ప్రాంతాల్లోని ఉప్పల్, నాచారం, మల్లాపూర్‌లో విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్ చేసినట్లు తెలిపారు. ఉప్పల్ భరత్‌నగర్‌కు చెందిన మహ్మద్ అబ్దుల్‌తోపాటు, ధర్మపురికాలనీకి చెందిన శంకర్‌లను అదుపులోకి తీసుకుని అరెస్ట్ చేసినట్లు తెలిపారు. వీరి వద్ద నుంచి 13 కిలోల గంజాయితోపాటు, ఒక మొబైల్ ఫోన్, హోండా బైక్ స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరిటెండెంట్ బి.ముకుందరెడ్డి, ఇన్‌స్పెక్టర్ బి.ఓంకార్, ఎస్ఐలు శ్రీనివాసులు, పి.నరేష్‌రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికి కృషి : ఎమ్మెల్యే మర్రి



సిసి రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి తదితరులు

మల్కాజిగిరి, జూలై 17 ప్రభాతవార్త : మౌలాలిగుట్ట చుట్టు ఉన్న సాదుల్లనగర్‌లో డ్రైన్ ఔట్‌లెట్ లేని కారణంగా చిన్నపాటి వర్షాలకే మురుగు నీరు భారీగా ఇళ్లల్లోకి చేరడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మౌలాలిలో పర్యటించి రియాజ్ ఉలూమ్ మదర్సా దగ్గర ఉన్న పరిస్థితులను పరిశీలించి చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్ళి సత్వర పరిష్కారం దిశగా అడుగులు వేస్తామని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో జగదీష్‌గౌడ్, మేకల రాముయాదవ్, అమీనుద్దీన్, భాగనంద్‌రావు, ఉస్మాన్, వంశీముదిరాజ్, జోగు శ్రీనివాస్, సంతోష్‌నాయుడు, ఇబ్రహీం, శైలెంధర్ తదితరులు పాల్గొన్నారు. అదే విధంగా మౌలాలి డివిజన్ పరిధిలోని హనుమాన్‌నగర్‌లో జరుగుతున్న సి.సి రోడ్డు పనులను అధికారులు, నాయకులతో కలిసి ఎమ్మెల్యే రాజశేఖర్‌రెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో జగదీష్‌గౌడ్, రాముయాదవ్, అమీనుద్దీన్, భాగ్యనంద్‌రావు, ఉస్మాన్, సంతోష్ నాయుడు, వంశీముదిరాజ్, శ్రీనివాస్, అరుణ్‌గౌడ్, శైలెంధర్ తదితరులు ఉన్నారు.

## అభివృద్ధిని చూసి ఓర్వలేకనే ప్రభుత్వంపై ఆరోపణలు : ఎస్‌కె మహమ్మద్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్కే మహమ్మద్

ఎల్.బి.నగర్, జూలై 17 ప్రభాతవార్త : తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధిని చూసి ఓర్వలేకనే బిఆర్‌ఎస్ నాయకులు ప్రభుత్వంపై, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిపై ఆరోపణలు చేస్తున్నారని రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు ఎస్‌కె.మహమ్మద్ అన్నారు. బుధవారం ఆర్కేపురంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఖిల్లామైసమ్మ దేవాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు రాష్ట్ర ప్రభుత్వంపై చేసిన ఆరోపణలను ఖండించారు. మహేశ్వరం నియోజకవర్గాన్ని మరో కొత్త నగరంగా తీర్చి దిద్దుతామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుంటే ప్రజాప్రభుత్వంపై నిందలు వేయడం సరికాదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో అనేక సార్లు ప్రోటోకాల్ ఉల్లంగించిన బిఆర్‌ఎస్ ప్రభుత్వం ఇప్పుడు ప్రోటోకాల్ పాటించడంలేదని నిరసన తెలపడం విడ్డురంగా ఉందన్నారు. ప్రజా ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే ప్రజలే వారికి తగు బుద్ధి చెబుతారని అన్నారు. కార్యక్రమంలో హైమద్, యూసఫ్, మొయిన్, షోహెబ్‌అక్తర్, గౌస్, రఫిక్ బాబా తదితరులు పాల్గొన్నారు.

## అష్టలక్ష్మి దేవాలయంలో లక్షతులసి పూజ

ఎల్.బి.నగర్, జూలై 17 ప్రభాతవార్త: తొలి ఏకాదశి సందర్భంగా ఆర్.కె.పురం డివిజన్ వాసవికాలనీలోని అష్టలక్ష్మి దేవాలయంలో లక్షతులసి పూజా కార్యక్రమం వేదబ్రాహ్మణుల మంత్రోచ్ఛరణ మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బంగారు వస్త్రాలతో అలంకరణలో ఉన్న శ్రీఆదిలక్ష్మిసమేత శ్రీమన్నారాయణుని దర్శించుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున దేవాలయం వద్ద బారులు తీరారు. దేవాలయ ప్రధానఅర్చకులు మరిగంటి రాఘవాచార్యులు ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవాలయం ఫౌండర్ చైర్మన్ గౌరిశెట్టి చంద్రశేఖర్‌గుప్తా, చైర్మన్ సోమ సురేష్, ప్రధానకార్యదర్శి గంప జగన్, కోశాధికారి అయిత అంజయ్యగుప్తా, వైస్‌చైర్మన్ నాగమల్ల శ్రవణ్‌కుమార్, కమిటీ సభ్యులు చిలుకా ఉపేందర్‌రెడ్డి, దాచేపల్లి శ్రీనివాస్, ఉమాపతి, మాలే శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## బోనాల పండుగ సందర్భంగా చెక్కుల పంపిణీ



చెక్కులు పంపిణీ చేస్తున్న చిన్నారెడ్డి, మల్‌రెడ్డి రాంరెడ్డి తదితరులు

ఎల్.బి.నగర్, జూలై 17 ప్రభాతవార్త : బోనాల పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని దేవాలయాల నిర్వాహకులకు ప్రభుత్వం చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని శ్రీకారం చుట్టింది. తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయంలో భాగంగా ఎల్బీనగర్ నియోజకవర్గం పరిధిలోని దేవాలయ కమిటీలకు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జి.చిన్నారెడ్డి, రాష్ట్ర రోడ్డు డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మల్‌రెడ్డి రాంరెడ్డి పలువురికి చెక్కులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తపేట, నాగోల్, లింగోజిగూడ డివిజన్ల కార్పొరేటర్లు నాయకోటి పవన్‌కుమార్, చింతల అరుణసురేంద్రనాథ్‌యాదవ్, ధర్పల్లి రాజశేఖర్‌రెడ్డి, కొత్తపేట డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు లింగాల కిషోర్‌గౌడ్, దేవాలయం కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆలయాల్లో ఘనంగా తొలి ఏకాదశి పూజలు

ఉప్పల్, జూలై 17 ప్రభాతవార్త : ఉప్పల్ సర్కిల్ పరిధిలోని పలు ఆలయాల్లో తొలి ఏకాదశి పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉప్పల్, రామంతాపూర్, హబ్సిగూడ, చిలుకానగర్ పరిధిలోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉప్పల్ స్వరూప్‌నగర్‌లోని శ్రీ కరిగిరి వెంకటేశ్వర స్వామి ఆలయం, రాఘవేంద్రనగర్‌లోని గణపతి ఆలయం, రామంతాపూర్‌లోని శ్రీ రమా సహిత సత్యనారాయణస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు. హబ్సిగూడలోని శ్రీ కోదండరామస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఉదయం నుంచే ఆలయాలకు తరలివచ్చారు. తొలి ఏకాదశి సందర్భంగా ఆలయాలను ప్రత్యేకంగా అలంకరించారు.



సైకిల్ పెట్రోలింగ్, సైబర్ క్రైమ్‌కు సంబంధించిన విషయాలపై యువతకు చైతన్యపురి శివాజీ విగ్రహం వద్ద అవగాహన కల్పిస్తున్న చైతన్యపురి ఇన్స్పెక్టర్ వెంకటేశ్వర్లు (ఎల్.బి.నగర్, ప్రభాతవార్త)